విద్యారంగాన్ని విస్మరించిన కాంగ్రెస్

- **బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి**

మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి

గొల్లపల్లి, ఫిబ్రవరి 13: విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో విద్యాశాఖ మంత్రిని ఎప్పుడు నియమిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.? విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. కొప్పుల ఈశ్వర్ మంత్రిగా ఉన్నప్పుడు మండలంలోని స్తంభంపెల్లిలో అగ్రికల్చర్ కాలేజీ నిర్మాణానికి 40 ఎకరాల స్థలం కేటాయించి, 2023 సెప్టెంబర్ 3న మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కాలేజీని జగిత్యాలకు తరలించారని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాకు మంజూరైన నవోదయ పాఠశాల కోసం ధర్మపురి మండలం నేరెల్ల గ్రామంలో సర్వే నంబర్ 252లో 30 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. నవోదయ విద్యాలయాన్ని ఎంపీ అర్వింద్ నిజామాబాద్‌కు తరలించాలని చూస్తున్నారని, దీనిని అడ్డుకొని నేరెల్లలోనే నవోదయ పాఠశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ కృషి చేయాలన్నారు. ఈ ప్రాంత పేద విద్యార్థుల కోసం కొప్పుల ఈశ్వర్ అంబేద్కర్ విజ్ఞాన భవన్ కోసం రూ. 2 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత ఎమ్మెల్యే భవనం నిర్మించకుండా గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు చందు, మాజీ వైస్ ఎంపీపీ సత్తయ్య, చెందోలి మాజీ సర్పంచ్ రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగా రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లింగా రెడ్డి, వీరస్వామి, బీఆర్ఎస్వీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోర్టుకు గైర్హాజరవుతున్న నిందితుడి అరెస్ట్

మెట్‌పల్లి, ఫిబ్రవరి 13: పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉండి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నిరంజన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన బానోతు శేషు గతంలోమెట్‌పల్లి పోలీస్ సబ్ డివిజనల్ పరిధిలో పలు చోరీలకు పాల్పడ్డాడు. అతడిపై మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో రెండు, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఆరు, మల్లాపూర్‌లో ఒకటి, కథలాపూర్‌లో ఒకటి, కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఒకటి చొప్పున కేసులు ఉన్నాయి. ఆయా కేసుల్లో అరెస్టు అయి జైలుకు వెళ్లొచ్చిన శేషు తర్వాత పేషీలకు సంబంధిత కోర్టుకు హాజరవకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. నిందితుడిని పట్టుకునేందుకు ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో మెట్‌పల్లి డీఎస్పీ రాములు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఎస్ఐ రాజు నాయక్, హెచ్‌సీ అశోక్‌కుమార్, పీసీలు రమణ, జలంధర్‌తో కూడిన బృందం పక్కా సమాచారంతో కర్నాటకలోని బీదర్ ప్రాంతానికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని వచ్చి మెట్‌పల్లి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. నిందితుడిగా పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐతో పాటు ఎస్ఐలు అనిల్, కిరణ్‌కుమార్, రాజు, రాజునాయక్, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

సాయికుమార్(ఫైల్)

కథలాపూర్, ఫిబ్రవరి 13: కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామ శివారులోని ఓ వ్యవసాయబావిలో సాయికుమార్(26) అనే యువకుడి మృతదేహం తేలినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన జక్కుల సాయికుమార్(26)కు కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామానికి చెందిన మానసతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఐదు రోజుల క్రితం సాయికుమార్ అత్తగారింటికి వచ్చి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకపోవడంతో ఈనెల 12న కథలాపూర్ పోలీస్ స్టేషన్‌లో సాయికుమార్ అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం పోసానిపేట గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో సాయికుమార్ మృతదేహం కనిపించింది. సాయికుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయని తన తండ్రి జక్కుల మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

డిఫాల్ట్ డబ్బులు చెల్లించాలి

జగిత్యాల, ఫిబ్రవరి 13: మిల్లర్లు డిఫాల్ట్ డబ్బులు మార్చి 31లోగా చెల్లించాలని అదనపు కలెక్టర్ లత ఆదేశించారు. జగిత్యాలలోని కలెక్టరేట్‌లో గురువారం ఆమె పౌరసరఫరాల, టాస్క్‌ఫోర్స్ అధికారులు, డిఫాల్ట్ అయిన మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2019-2024 వరకు డిఫాల్ట్ అయిన మిల్లర్లు డబ్బులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం చేవద్దన్నారు. 2024-25 వానకాలంలో దించుకున్న ధాన్యానికి సంబంధించి 10 శాతం బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలని సూచించారు. డిఫాల్ట్ అయిన మిల్లర్లకు ఇదే చివరి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్, డీఎస్‌వో, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ

రాయికల్, ఫిబ్రవరి 13: మండలంలోని రాజానగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ యూత్ సభ్యులు గురువారం 40 ప్లేట్లు, 40 గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్, ఉమ, విజయ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

సమన్వయంతో పని చేయాలి

- **లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి**
- **కలెక్టర్ సత్యప్రసాద్**

ధర్మపురి, ఫిబ్రవరి 13: అధికారులు సమన్వయంతో పనిచేసి ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మార్చి 10 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం ధర్మపురిలోని పాత టీటీడీ కల్యాణ మండపంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల నుంచి ధర్మపురి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు రవాణా సదుపాయాన్ని మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరి స్నాన ఘట్టాల వద్ద, ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరిలో లోతైన ప్రాంతాలైన సత్యవతి గుండం, బ్రహ్మగుండం వద్దకు భక్తులు వెళ్లకుండా అప్రమత్తపరచాలన్నారు. ఆ ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను నియమించాలన్నారు. జాతర జరిగే 13 రోజుల పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన రైస్‌మిల్లర్లను అభినందించారు. ఎస్పీ అశోక్ మాట్లాడుతూ, జాతరలో అవాంచనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ రఘుచందర్, ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ కృష్ణచైతన్య, కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాల్లో అభ్యంతరాలుంటే తెలపాలి

పెగడపల్లి: ఆయా పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

వెల్గటూర్/పెగడపల్లి, ఫిబ్రవరి 13: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాలను తయారు చేసి గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించామని, ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని ఎంపీడీవోలు వెంకటేశ్వర రావు, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వెల్గటూర్, పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం వారు వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలు మాట్లాడుతూ, ఓటరు జాబితాల్లో అభ్యంతరాలుంటే ఈ నెల 15వ తేదీ వరకు రాతపూర్వకంగా తెలుపాలని కోరారు. పెగడపల్లిలో ఎంపీవో మహేందర్, నాయకులు లోక మల్లారెడ్డి, కొమురెల్లి, విజయభాస్కర్, కాంతయ్య, భూమేశ్వర్, శంకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

జగిత్యాల, ఫిబ్రవరి 13: జగిత్యాలలోని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 36 మంది విశిష్ట వయోధిక మహిళలను తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు పట్టు శాలువాలు, మెమొంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, బొల్లం విజయ్, పీసీ హన్మంత రెడ్డి, ఎండీ యాకూబ్, కోశాధికారి వెలుముల ప్రకాశ్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు అశోక్ రావు, సత్యనారాయణ, నాయకులు దిండిగాల విట్టల్, గడ్డం మారుతి, కుంటాల కిషన్, కొక్కుల నారాయణ, వేముల దేవరాజం, ఉప్పుగళ్ల మురళీధర్, దేవేందర్ రావు, ఎండీ యూసుఫ్, ఎక్బాల్, యాకూబ్ హుస్సేన్, దేవేందర్ రావు, పబ్బా శివానందం, బుచ్చిరెడ్డి, వెల్ముల ప్రభాకర్ రావు, కండ్లే గంగాధర్, కరుణ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

16న జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు

జగిత్యాల/జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 13: జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో ఈనెల 16న జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ బాలుర, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ జగిత్యాల అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, 55 కిలోలలోపు బరువు ఉండాలని, ఏప్రిల్, 2009 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 89783 78306లో సంప్రదించాలని కోరారు.

12 గంటల పాటు పారాయణం చేసిన జగిత్యాల వాసి

జగిత్యాల, ఫిబ్రవరి 13: పన్నెండు గంటలపాటు ఏకధాటిగా అఖండ లలితామాత సహస్రనామ స్తోత్ర పారాయణం చేసిన వుటూరి కళ్యాణిని పలువురు అభినందించారు. జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని 108 శ్రీ చక్ర సహిత లలితామాత ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా జగిత్యాలకు చెందిన వూటూరి కళ్యాణి బుధవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అశేష భక్తుల సమక్షంలో లలితా సహస్రనామ పారాయణం చేసి అందరితో శభాష్ అనిపించుకుంది. కాగా, కళ్యాణిని ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ చెల్లం స్వరూప-సత్తయ్య గురువారం అభినందించి, అమ్మవారి వస్త్రాలు అందజేశారు. అలాగే, కళ్యాణికి సుహాసినులు పాంపట్టి సులోచన, పెద్ది అశ్విని, చింత రోజా, బొడ్డు వనిత, రుచిత, గోపతి స్వప్న, చెట్ల జానకి, దీప, అర్చన, వనజ, తదితరులు అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఏడీఈ వరుణ్‌కుమార్, ఏఈ వెంకటరెడ్డి

పెగడపల్లి, ఫిబ్రవరి 13: వేసవిలో విద్యుత్ లో-వోల్టేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీఈ వరుణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలం నామాపూర్, మ్యాకవెంకయ్యపల్లి, రాజారాంపల్లి, ఎల్లాపూర్, ల్యాగలమర్రి గ్రామాల్లో విద్యుత్ లో-వోల్టేజీ సమస్య పరిష్కారానికి గానూ ఏర్పాటు చేసిన సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఈ వరుణ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని డిమాండ్‌కు తగ్గట్లు అదనపు విద్యుత్ లైన్లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటరెడ్డి, లైన్ మెన్లు శేఖర్‌రెడ్డి, శంకర్, సిబ్బంది ఆనంద్, పరశురాంగౌడ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు మహిళల అరెస్ట్

కథలాపూర్, ఫిబ్రవరి 13: కథలాపూర్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన గజెల్లి లక్ష్మి మెడలోంచి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఇద్దరు మహిళలను గురువారం రాత్రి పట్టుకొని అరెస్టు చేసినట్లు కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, కథలాపూర్ ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి 4 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన ఓ మహిళ, రాయికల్‌కు చెందిన మరో మహిళతో కలిసి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఆవు మృతి

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 13: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన ఆజే మోహన్‌కు చెందిన పశువుల కొట్టం గురువారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. కాగా, కొట్టంలో ఉన్న ఆవు మృతి చెందింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పశువుల కొట్టం, మృతి చెందిన ఆవును పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని చలిగల్ గ్రామంలో గల 11కేవీ ఫీడర్‌లో లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దొంతు శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పసుపు క్వింటాల్ @ రూ.11,111

మెట్‌పల్లి, ఫిబ్రవరి 13: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పసుపు కాడి (కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.11,111, కనిష్ఠ ధర రూ.7,006, పసుపు గోళ (మండ)కు గరిష్ఠ ధర రూ.9,551, కనిష్ఠ ధర రూ.7,266, పసుపు చూరకు గరిష్ఠ ధర రూ.9,511 కనిష్ఠ ధర రూ.8,166 పలికినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు మార్కెట్‌లో 3073 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 13: పైడిమడుగులోని జడ్పీ ఉన్నత పాఠశాల ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తెలిపారు. అండర్-16, 18 లాంగ్ జంప్ విభాగాల్లో ఆకుల రాంచరణ్, నవదీప్ ప్రతిభ చూపి ఈ నెల 18, 19వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయురాలు శ్రీలత, గ్రామస్తులు అభినందించారు.

బలహీన వర్గాలకు హక్కులు కల్పించడమే ధ్యేయం

జగిత్యాల, ఫిబ్రవరి 13: బలహీన వర్గాలకు రాజ్యాంగ హక్కులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో విప్ లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు చర్యలు

పెద్దపల్లి, ఫిబ్రవరి 13: జిల్లాలో బాలల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో జిల్లాను బాల కార్మిక రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బాలల సంరక్షణ చర్యలపై గురువారం కలెక్టరేట్‌లో మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అనాథ పిల్లలు, సెమీ ఆర్ఫన్ పిల్లలో స్పా న్సర్‌షిప్‌కు అర్హులైన పిల్లలను గుర్తించి, వారి వివరాలు సేకరించాలన్నారు. గ్రామీణ బాలల పరిరక్షణ కమిటీలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. బాల్యవివాహాలు, బాల కార్మికులు కనిపిస్తే వెంటనే 1098కి ఫోన్‌చేసి వివరాలు అందించాలని సూచించారు. అనాథ పిల్లలను బాల సదనం లో చేర్పించాలన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, డబుల్ బెడ్రూం ఇండ్లలో విద్యుత్ సరఫరా పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశమై, మాట్లాడారు. ఇప్పటి వరకు 266 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 47అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు రోజుల్లోగా, మారుమూల ప్రాం తాల్లో ఉన్న మరో 26అంగన్‌వాడీ కేంద్రాల్లో వారంలోగా విద్యుత్ సరఫరా కల్పించాలన్నారు. పెద్దపల్లి పట్టణంలోని చందంపల్లి, రాంపల్లిలో నిర్మించిన డబు ల్ బెడ్రూం ఇండ్లకు సైతం విద్యుత్ సరఫరా పనులు వారం వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు.

డయాలసిస్ యూనిట్‌ను వినియోగించుకోవాలి

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి13: పెద్దపల్లి ప్రభుత్వ ప్రధాన దవాఖాన ప్రాంగణంలో నూతనంగా చేపట్టిన 42పడకల గదుల నిర్మాణ పనులు తుదిదశకు చేరాయని, భవనంలో డయాలసిస్ యూనిట్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం 42పడకల గదుల పనులను పరిశీలించి, మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం దవాఖాన ప్రాంగణంలో నిర్మించిన 42 పడకల గదుల నిర్మాణ పనులు తుది దశకు చేరాయన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
GOLD FINANCE
★ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

బీమా చెక్కు అందజేత

లక్ష్మి కుమారుడు లక్ష్మణ్‌కు బీమా చెక్కు అందజేస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్ డా.శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి, ఫిబ్రవరి 13: ధర్మపురి సహకార సంఘ సభ్యురాలు బుగ్గారం మండలం మద్దునూర్ గ్రామానికి చెందిన బండారి చిన్న సత్తెమ్మ కొద్ది రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందింది. సహకార సంఘం ద్వారా ప్రమాద బీమా రూ.లక్ష మంజూరైంది. కాగా, డీసీఎమ్మెస్ చైర్మన్ డా.శ్రీకాంత్‌రెడ్డి గురువారం లక్ష్మి కుమారుడు లక్ష్మణ్‌కు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ పెరుమాండ్ల ఎల్లాగౌడ్, కేడీసీసీబీ మేనేజర్ లక్ష్మి, సీఈవో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తికి ఏడాది జైలు

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడడానికి కారణమైన హార్వేస్టర్ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి శ్రీనీజ కోహిర్కర్ గురువారం తీర్పునిచ్చారు. కోర్టు సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం మోతె గ్రామానికి చెందిన అర్ముల్ల మధుసూదన్ 2019 నవంబర్ 12న హార్వేస్టర్‌ను రిపేర్ చేస్తుండగా, సాయం కోసం అదే గ్రామానికి చెందిన కల్లెడ సత్తయ్యను పిలిచాడు. సత్తయ్య రిపేర్ చేస్తుండగా, మధుసూదన్ హార్వేస్టర్‌ను స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు. దీంతో సత్తయ్య కాలిపైకి హార్వేస్టర్ ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో కేసు పూర్వాపరాలు పరిశీలించి, నిర్లక్ష్యంగా వాహనం నడిపిన మధుసూదన్‌కు ఏడాది జైలు శిక్ష, రూ. 1100 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

రాయికల్/కథలాపూర్, ఫిబ్రవరి 13: రాయికల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, కథలాపూర్ జడ్పీ హైస్కూల్‌లో గురువారం సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకొని జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆంగ్లంలో ఉపన్యాస, వ్యాసరచన పోటీలు, స్టోరీ టెల్లింగ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పొన్నం రమేశ్, ఉపాధ్యాయులు మల్లేశం, సత్యనారాయణ, గంగజమున, అలీ రాజా, తిరుమల, వనిత, శివానందం, గంగాధర్, శ్రీకాంత్, యాస్మిన్ ఫాతిమా, ఏడుకొండలు, అశోక్, నీలిమా, లక్ష్మి, రవీందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని రక్షించడమే నిజమైన దేశభక్తి

కోరుట్ల, ఫిబ్రవరి 13: భారత రాజ్యాంగాన్ని రక్షించడమే నిజమైన దేశభక్తి అని జమాతే ఇస్లామీ హింద్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో గురువారం 'భారత రాజ్యాంగం-నేటి సమస్యలు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ అహ్మద్ ఖాన్, నాయకులు మసూద్ అలీ, లక్ష్మీ నారాయణ, శ్రీహరి, నారాయణ, రాజారెడ్డి, రాజు, శంకర్, సత్యనారాయణ, ప్రేమసాగర్, బాబురావు, ముత్యాలరావు, మాలజీ, విశ్వనాథం పాల్గొన్నారు.

కోరుట్ల కొత్త బస్టాండ్‌లో చోరీ

- **మహిళ బ్యాగులోంచి 4 తులాల బంగారం, రూ. 700 నగదు అపహరణ**

కోరుట్ల, ఫిబ్రవరి 13: కోరుట్లలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో గురువారం చోరీ జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన వెలిచాల రుచిత గురువారం తన కూతురు సాత్విక, కుటుంబసభ్యులతో కలిసి తన తల్లిగారి ఊరైన కథలాపూర్ మండలం తాండ్య్రాలకు మూడు రోజుల క్రితం జాతర కోసం వచ్చింది. గురువారం ఆటోలో తన కుటుంబసభ్యులతో తాండ్య్రాల నుంచి కోరుట్ల కొత్త బస్టాండ్‌కు చేరుకుంది. ఆదిలాబాద్‌కు వెళ్లేందుకు మెట్‌పల్లి బస్సు ఎక్కింది. టికెట్ తీసుకునేందుకు ఆధార్ కార్డు కోసం బ్యాగు తెరిచి చూడగా అందులో ఉంచిన పర్సు కనిపించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించిన రుచిత పర్సులో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ. 700 నగదు ఉన్నట్లు వాపోయింది. చోరీ జరిగిన ప్రాంతాన్ని కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు. బస్టాండులో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ల ఆధారంగా ఇద్దరు మహిళలు చోరీకి పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికలు ధైర్యంతో ముందుకు సాగాలి

కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు

కథలాపూర్, ఫిబ్రవరి 13: బాలికలు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని, మానసిక ధైర్యంతో ముందుకు సాగాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కో-ఆర్డినేటర్ సురేశ్ పేర్కొన్నారు. 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం పదేళ్లు పూర్తయిన సందర్భంగా కథలాపూర్ జడ్పీ హైస్కూల్‌లో గురువారం 'బాలికలకు మానసిక ఆరోగ్యం, ప్రేరణ' అంశంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎండీ హైమాదిబేగం, మహిళా సాధికారత బృందం ప్రతినిధులు స్వప్న, రజిత, అంగన్‌వాడీ టీచర్లు జలజ, శారద, రాజేశ్వరి పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి ప్రధాని ప్రశంసాపత్రం

మధుహాసినికి ప్రధాని పంపిన ప్రశంసాపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కథలాపూర్, ఫిబ్రవరి 13: కథలాపూర్ కేజీబీవీ పదో తరగతి విద్యార్థి కైలాసకోటి మధుహాసినికి ప్రధాన మంత్రి మోదీ గురువారం ప్రశంసాపత్రం పంపించారు. గతేడాది గుజరాత్ రాష్ట్రంలో కేంద్ర మానవ వనరులశాఖ ఆధ్వర్యంలో ప్రేరణ మహోత్సవం జాతీయ సదస్సు నిర్వహించగా, మధుహాసిని హాజరైనట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మధుహాసినిని ఎంఈవో లోకిని శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం మారంపెల్లి అర్జున్, ఉపాధ్యాయులు అభినందించారు.

గోశాలకు విరాళం

మారుతీనగర్, ఫిబ్రవరి 13: మెట్‌పల్లి పట్టణ శివారులోని ఆరపేట శివాలయ ఆవరణలో గల గోశాల అభివృద్ధికి సిద్దిపేట పట్టణానికి చెందిన సంతోష్-పార్వతి దంపతులు రూ.5116 గురువారం గో సేవా సమితి సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గోశాల సంరక్షకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

కోరుట్ల, ఫిబ్రవరి 13: పట్టణంలోని నలంద హైస్కూల్‌లో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ సృజనాత్మకతను జోడించి తయారు చేసిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. వైజ్ఞానిక ప్రదర్శనను కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు నాగేంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీకి స్వర్ణశక్తి అవార్డు

జ్యోతినగర్, ఫిబ్రవరి 13: రామగుండం ఎన్టీపీసీలో హిందీభాషని ప్రోత్సహించి అత్యుత్తమ ప్రతిభ కనబరచడంపై రామగుండం ఎన్టీపీసీకి స్వర్ణశక్తి అవార్డు లభించింది. ఈ మేరకు గురువారం చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన స్వర్ణశక్తి అవార్డుల ప్రదానోత్సవంలో ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్‌సింగ్ చేతులమీదుగా రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ప్రాజెక్టు సీజీఎం చందన్‌కుమార్ సమంత స్వర్ణశక్తి అవార్డు (ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ రాజ్‌భాష విభాగం) అందుకున్నారు. ఎన్టీపీసీలో అధికార భాష హిందీని అమలు చేయడంలో కృషి చేసిన ఏజీఎం హెచ్ఆర్ బిజోయ్‌కుమార్ సిక్దర్, రాజ్‌భాష అధికారి ఆదేశ్‌కుమార్ పాండే, బృందాన్ని సీజీఎం అభినందించారు

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మంథని, ఫిబ్రవరి 12: మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్, స్త్రీనిధి ఆర్ఎం దుర్గాప్రసాద్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలు, సిబ్బందితో కలిసి కొత్త సంఘాల ఏర్పాటుపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలోని రేషన్ కార్డు కలిగి ఉండి 18 ఏళ్లు పైబడిన మహిళలను గుర్తించి స్వశక్తి సంఘాలతో కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు.